తెలంగాణ TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 14 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 102 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

తెలంగాణ ముచ్చట్లు పాఠకులకు, శ్రేయోభిలాషులకు వినాయకచవితి శుభాకాంక్షలు..

రేపు సంచిక వెలువడదు.. తిరిగి బుధవారం కలుసుకుందాం..

సభను నడపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు

- ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం దూరంగా ఉందని ఆరోపణ
- వాయిదా తీర్మానాలను పక్కనపెట్టారని మండలి ప్రతిపక్ష నేత వ్యాఖ్యలు
- బిల్లుల ఆమోదానికే పరిమితమైన సమావేశాలంటూ విమర్శ.. సిరికొండ మధుసూదనాచారి

2లో

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రేవంత్ భరోసా

- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన
- పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం
- ఆర్యవైశ్యులు విశ్వాసానికి బ్రాండ్ అంబాసిడర్లని వ్యాఖ్య
- ఐక్యతతోనే రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం సాధ్యమని సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు):

పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. సమాజంలో సౌమ్యులు, మానవతావాదులుగా పేరుగాంచిన ఆర్యవైశ్యులు పేదల విశ్వాసాన్ని నిలబెట్టే బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో నిర్మించనున్న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయానికి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు వేమనరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌తో పాటు పలువురు శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ భవనం కేవలం ఒక భవనంగా

మిగతా 2లో..

రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణకు చర్యలు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి చేసిన కీలక ప్రణాళికలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందించనున్న ప్రభుత్వం
- ఆరు నెలల్లో పలు ఆసుపత్రుల్లో రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణ
- టిమ్స్‌లో స్టేట్ లెవల్ మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన స్టేట్ లెవల్ మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సామాన్య ప్రజలకు అత్యున్నత వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వర్క్‌షాప్ సందర్భంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక మెడికల్ రోబోటిక్ పరికరాలు, మౌలిక వసతులను మంత్రి పరిశీలించారు. రోబోటిక్ సర్జరీ రంగంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధి, వాటి వినియోగం, భవిష్యత్ అవకాశాలపై నిపుణులతో చర్చించారు. వైద్యరంగంలో ఆధునిక సాంకేతికతను మరింతగా వినియోగించి ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఫార్మా హబ్‌గా పేరుగాంచిన తెలంగాణను వైద్య సేవల రంగంలో కూడా అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కొత్త

మిగతా 2లో..

ప్రపంచ సవాళ్లను కలిసి ఎదుర్కోవాలి

- సాంకేతికత, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు
- బ్రిక్స్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌పై ఏకాభిప్రాయం

2లో

బీసీ కులగణనకు కోడ్ విధానం కావాలి

- మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్
- ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలన్న సూచన
- కులగణన విషయంలో బీజేపీ, కాంగ్రెస్ తమ బాధ్యత నిర్వర్తించాలని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా బీసీలను ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు):

దేశవ్యాప్తంగా బీసీ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో నిర్వహించిన ఓబీసీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, బీసీలకు న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని పేర్కొన్నారు. కులాల గుర్తింపులో పొరపాట్లు జరగకుండా ముందుగానే స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కులగణన అత్యంత కీలకమని గతంలో పేర్కొన్న బీజేపీ ప్రభుత్వం, కులగణన ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అవసరమైన విధానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

మిగతా 2లో..

కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం

- పార్టీ మార్పు ప్రచారాన్ని ఖండించిన కొండా సురేఖ
- కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- వరంగల్ తూర్పు నుంచి మళ్లీ పోటీ చేస్తానని వెల్లడి
- మంత్రి పదవి కోల్పోవడంపై స్పందించిన మాజీ మంత్రి

2లో

వినాయక చవితికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

- ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించిన రేవంత్
- గణేష్ మండపాల వద్ద భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు

2లో

పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

- పొన్నం ప్రభాకర్ సమక్షంలో విశిష్ట వ్యక్తులకు సత్కారం
- వ్యవసాయం, సాహిత్యం, కళల రంగాల్లో సేవలకు గుర్తింపు
- పురస్కార గ్రహీతలకు నగదు బహుమతి, మెమెంటో అందజేత

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

కరీంనగర్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): శ్రీ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీ పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా "పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం-2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజంలోని వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఈ సందర్భంగా సత్కరించారు. వ్యవసాయ రంగంలో ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, కళారంగంలో గొట్టే కనకవ్వలకు "పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం-2026" ప్రదానం చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పురస్కారాలను అందజేశారు.

పురస్కార గ్రహీతలకు మెమెంటోతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని కూడా అందజేశారు. తమ తమ రంగాల్లో దీర్ఘకాలంగా అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు ప్రదానం చేయడం విశేషమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పొన్నం సత్తయ్య గౌడ్ సేవలను స్మరించుకున్నారు. సమాజ అభ్యున్నతి, సామాజిక చైతన్యం, ప్రజా సేవల పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

పెద్ద సంఖ్యలో అభిమానులు, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. పురస్కారాల ద్వారా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను ప్రోత్సహించడం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేసిన మహనీయుల వారసత్వాన్ని భావితరాలకు చేరవేయడం ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.

వినాయక చవితికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): వినాయక చవితి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో ఉన్న ఆటంకాలు తొలగిపోయి ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని గణపతిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ప్రజలను ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల్లో భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించాలని సూచించారు. గణపతి నవరాత్రులను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పండుగ వేళ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే గణేష్ మండపాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనాలు చేసుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖతో పాటు సంబంధిత అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గణేష్ మండపాల వద్ద మౌలిక వసతులు, భద్రతా చర్యలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ సంవత్సరం కూడా వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. భక్తులు ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్రంలో శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి మరింత పెరగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు.

ప్రపంచ సవాళ్లను కలిసి ఎదుర్కోవాలి: మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): భారత్ అతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు కేవలం దేశాల మధ్య సంబంధాలకే పరిమితం కాకుండా సాధారణ ప్రజల జీవన విధానంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో స్థిరత్వం, శాంతి, అభివృద్ధి కోసం బ్రిక్స్ కీలక వేదికగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

బ్రిక్స్ కూటమిలో భారత్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించిన ప్రధాని, స్థితిస్థాపకత, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత అనే నాలుగు ప్రధాన మూలస్తంభాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సభ్య దేశాల సహకారంతో ఈ లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకురావడంలో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, ఉమ్మడి ప్రయోజనాల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా కూటమి ముందుకు సాగుతోందన్నారు.

ప్రపంచం గత కొన్ని సంవత్సరాల్లో మహమ్మారులు, ప్రకృతి విపత్తులు, సరఫరా గొలుసు అంతరాయాలు వంటి అనేక సంక్షోభాలను ఎదుర్కొందని మోదీ గుర్తు చేశారు. ఈ సమస్యలు ఏ ఒక్క దేశానికో లేదా ప్రాంతానికో పరిమితం కావని, వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. అందువల్ల సవాళ్లను ముందుగానే గుర్తించి వాటిని సమర్థంగా ఎదుర్కొనే వ్యవస్థలు అవసరమని చెప్పారు. సమస్యలు తీవ్రమయ్యేలోపే స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో అంటువ్యాధుల నివారణ, స్పందన కోసం "బ్రిక్స్ ఇంటిగ్రేటెడ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్" ఏర్పాటుపై సభ్య దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ప్రధాని వెల్లడించారు. భవిష్యత్తులో సంభవించే ఆరోగ్య అత్యవసర పరిస్థితులను ముందుగానే గుర్తించి సమన్వయంతో చర్యలు తీసుకోవడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే విపత్తు నిర్వహణలో సమర్థతను పెంచేందుకు "ఎర్లీ వార్నింగ్ డేటా ఇంటిగ్రేషన్ గైడ్‌లైన్స్" కూడా రూపొందించినట్లు వివరించారు. ఈ చర్యలు సభ్య దేశాల భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. సాంకేతికత మరియు కీలక ఖనిజాలను రాజకీయ లేదా వ్యూహాత్మక ఆయుధాలుగా ఉపయోగించే ధోరణిపై కూడా మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు ప్రపంచ అభివృద్ధికి, ఉమ్మడి శ్రేయస్సుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులో ఉండేలా, కీలక వనరుల వినియోగం సమతుల్యంగా ఉండేలా ప్రపంచ దేశాలు కృషి చేయాలని సూచించారు. సహకారానికి బదులుగా పోటీ, ఆధిపత్య ధోరణులు పెరిగితే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.బ్రిక్స్ దేశాలు మానవాళి సంక్షేమం, సుస్థిర అభివృద్ధి, సమాన అవకాశాల సాధన కోసం కలిసి పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. సభ్య దేశాల మధ్య బలమైన అనుబంధం ఏర్పడితే ప్రపంచ సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పరస్పర గౌరవం, భాగస్వామ్యం, నమ్మకం ఆధారంగా ముందుకు సాగడమే బ్రిక్స్ భవిష్యత్తు విజయానికి కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, అభివృద్ధి, స్థిరత్వానికి బ్రిక్స్ మరింత బలమైన వేదికగా ఎదగాలని మోదీ ఆకాంక్షించారు.

బీసీ కులగణనకు కోడ్ విధానం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

బీసీ కులగణన చేస్తామని చెప్పి ఇప్పుడు సరైన వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం మాట తప్పడమేనని ఆరోపించారు. కుల గణన అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీ కులాలకు కూడా ప్రత్యేక కోడ్‌లు కేటాయించాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలిచే పరిస్థితులు ఉన్నాయని, ధోబీ-రజక, నాయీ బ్రాహ్మణ-మంగలి, గౌడ్-ఈడిగ, శ్రీశైన-నాదార్, ముదిరాజు, ఫిషర్‌మెన్ వంటి కులాలు ప్రాంతాలవారీగా భిన్న పేర్లతో నమోదవుతున్నాయని వివరించారు. కేవలం పేర్ల ఆధారంగా నమోదు చేస్తే స్పెల్లింగ్, ఉచ్చారణలో చిన్న తేడాల వల్లే కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం ఉందన్నారు. 2011లో నిర్వహించిన కులగణనలో కులాల పేర్లను శాస్త్రీయంగా వర్గీకరించకపోవడంతో లక్షలాది కులాలు ఉన్నట్లు నమోదు చేసిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు.బ్రిటిష్ పాలనలో 1931లో జరిగిన కులగణనలో సుమారు 4,300 కులాలు నమోదయ్యాయని, ప్రస్తుతం సరైన జాబితా లేకుండా సర్వే చేస్తే మరింత గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల రాష్ట్రాల వారీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జాబితాల తరహాలో దేశవ్యాప్తంగా ఓబీసీ కులాల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని సూచించారు .“జిత్నీ ఆబాదీ ఉత్నా హిస్సా” అనే నినాదం నిజంగా అమలు కావాలంటే ముందుగా దేశంలో బీసీల జనాభా ఎంతుందో ఖచ్చితంగా లెక్కించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లలో కూడా బీసీ మహిళలకు న్యాయం జరగాలంటే బీసీ జనాభా, ప్రాతినిధ్యంపై స్పష్టమైన గణాంకాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు తగిన వాటా కల్పించాలంటే సమగ్ర కులగణన అనివార్యమని స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా బీసీ నాయకులు, మేధావులు, సామాజిక సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కాస్ట్ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. లక్షలాది మందితో ఆందోళనలు నిర్వహించి, ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి బీసీ కులగణనలో శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రేవంత్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లలకు విద్య, శిక్షణ, అభివృద్ధి అవకాశాలు కల్పించే కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సంఘ ప్రతినిధులకు సూచించారు. సాధారణ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన మహాత్మా గాంధీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహనీతగా ఎదగడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో గాంధీ విగ్రహాలు కనిపించడం ఆయన ప్రభావానికి నిదర్శనమన్నారు. అలాగే ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక మంత్రిగా విశిష్ట సేవలందించిన కొణిజేటి రోశయ్య సేవలను కూడా స్మరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అవసరమైన సరుకులను అరువుగా ఇచ్చి ఆదుకునే విషయంలో ఆర్యవైశ్యులు మానవతా దృక్పథంతో వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి తెలిపారు. నమ్మకాన్ని నిలబెట్టడంలో వారి పాత్ర విశేషమని పేర్కొన్నారు. ముందుచూపు, ఆర్థిక క్రమశిక్షణ, జాగ్రత్తగా వ్యవహరించే లక్షణాలు ఆర్యవైశ్యుల డీఎన్ఏలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా, సమైక్యంగా ముందుకు సాగితేనే మరింత బలం చేకూరుతుందని రేవంత్ రెడ్డి సూచించారు. రాజకీయ రంగంలోనూ తమ వాటాను తామే సాధించుకోవాలంటే ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం కల్పించిందని గుర్తుచేస్తూ, భవిష్యత్తులోనూ వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

సభను నడపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): శాసన మండలి సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, పాలనా డొల్లతనం బట్టబయలయ్యాయని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపలేదని ఆరోపించారు. సభ నిర్వహణలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించలేదని వ్యాఖ్యానించారు. మండలి సమావేశాల సందర్భంగా పోలీసుల భారీ మోహరింపు, ప్రత్యక్ష ప్రసారాల్లో వివక్షత చోటుచేసుకుందని మధుసూదనాచారి ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులు ఉమ్మడి రాష్ట్రంలో కూడా చూడలేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలకు సంబంధించిన 20 అంశాలను ప్రతిపక్షం తరపున సభలో ప్రస్తావించిన ప్పటికీ వాటిని చర్చకు అనుమతించలేదని తెలిపారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా పక్కనపెట్టారని ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన అత్యవసర అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం బిల్లుల ఆమోదానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని మధుసూదనాచారి విమర్శించారు. ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం చర్చకు దూరంగా ఉందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభలు, శాసన మండళ్లు ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉండాలని ఆయన అన్నారు. అలాంటి వేదికలను కేవలం చట్టాల ఆమోదానికి మాత్రమే పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష అభిప్రాయాలను కూడా ప్రభుత్వం గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను భవిష్యత్తులో కూడా సభలో బలంగా ప్రస్తావిస్తామని మధుసూదనాచారి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై స్పందించి చర్చలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా సభా నిర్వహణ జరగాలని కోరారు.

కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం



వరంగల్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్‌లో తన భర్త కొండా మురళితో కలిసి పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన లేదని తేల్చి చెప్పారు. తాము కాంగ్రెస్‌లోనే పుట్టి పెరిగామని, ఆ పార్టీతోనే తమ రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని కొండా సురేఖ పేర్కొన్నారు. గతంలో కొన్ని రాజకీయ పరిస్థితుల కారణంగా బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని, కానీ కాంగ్రెస్‌తో తమ అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని అన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ టికెట్‌పైనే పోటీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి పదవి నుంచి తొలగించిన విషయంపై స్పందిస్తూ, పదవి కోల్పోయి నందుకు తనకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదన్నారు. అయితే తనను ఎందుకు తప్పించారో కారణం చెప్పకపోవడం మాత్రమే బాధ కలిగించిందని పేర్కొన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన శాఖలను పారదర్శకంగా నిర్వహించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడబోనని వారికి స్పష్టం చేసినట్లు సురేఖ వెల్లడించారు. ఈ సందర్భంగా తన భర్త కొండా మురళికి త్వరలోనే కీలక బాధ్యత లేదా పదవి దక్కే అవకాశాలపై కూడా అధిష్ఠానం నుంచి సంకేతాలు వచ్చాయని తెలిపారు.

రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ పోటీ చేసి విజయం సాధిస్తానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే త్వరలో జరగనున్న వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ నాయకులపై కూడా కొండా సురేఖ విమర్శలు చేశారు. కొందరు నేతలు తమపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. గత రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ కొందరు స్థానిక నాయకులు తమను మోసం చేశారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, భవిష్యత్తులోనూ పార్టీ కోసం కృషి కొనసాగిస్తామని సురేఖ స్పష్టం చేశారు.

రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

టిమ్స్ ఆసుపత్రులు, ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్య విద్య అందించేందుకు మెడికల్ కాలేజీలు, శిక్షణా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో వచ్చే ఆరు నెలల్లో రోబోటిక్ సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. దేశంలో రోబోటిక్ సర్జరీ రంగంలో ప్రముఖ నిపుణుడైన డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ సేవలను తెలంగాణలో వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నిమ్స్ ఆసుపత్రి వెయ్యికి పైగా రోబోటిక్ సర్జరీలు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు.రాష్ట్రంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, టిమ్స్ ఆసుపత్రులు, నూతన ఉస్మానియా ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, నీలోఫర్ ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా రోబోటిక్ సర్జరీ సేవలను విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న టిమ్స్, ఉస్మానియా ఆసుపత్రులు పూర్తయితే రాష్ట్రంలో 40 వేలకుపైగా పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మెడికల్ టూరిజం పాలసీలో భాగంగా టిమ్స్ ఆసుపత్రిలో 100 పడకలను అంతర్జాతీయ రోగుల కోసం కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్, ట్రామా కేర్ విధానాలను అమలు చేస్తున్నామని, ప్రస్తుతం 102 డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తుండగా మరో 79 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణను దేశంలోనే అడ్వాన్స్డ్ రోబోటిక్ సర్జరీ సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 14 - సెప్టెంబర్ - 2026
వరంగల్ 03

అధికారంలో ఉండి కాంగ్రెస్ ధర్నాలు చేయడం విడ్డూరం

- **రాజకీయంగా ఎదుర్కోలేకే నిరసనలకు దిగుతున్నారు**
- **బీఆర్ఎస్ నాయకుడు అల్వాల వెంకట్ రెడ్డి**

పెద్దమందడి,సెప్టెంబర్13(తెలంగాణ ముచ్చట్లు): కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఆ పార్టీ నాయకులే ధర్నాలు, నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని వనపర్తి జిల్లా పెద్దమందడి మండల బీఆర్ఎస్ నాయకుడు అల్వాల వెంకట్ రెడ్డి విమర్శించారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కొనే ధైర్యం లేకనే ఆందోళనల పేరుతో రోడ్డెక్కుతున్నారని ఆరోపించారు.ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు పరిమితం కావడం సరికాదన్నారు. ముఖ్యంగా రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తూ, నీరు అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సాగునీటి సరఫరాపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, అవసరమైన మేరకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై దృష్టి పెట్టకుండా నిరసనల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించడం మానుకోవాలని సూచించారు.చావు డప్పులతో చావును కోరుకోవడం ఏంటి? అని ప్రశ్నించిన అల్వాల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. రైతులకు సాగునీరు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



- **పామిరెడ్డిపల్లి జిపిఓ నాగరాజు**

పెద్దమందడి,సెప్టెంబర్13(తెలంగాణ ముచ్చట్లు): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి జిపిఓ నాగరాజు సూచించారు. అర్హత కలిగిన కొత్త ఓటర్ల కోసం ఫారం6 దరఖాస్తులను స్వీకరించడం జరుగుతోందని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులతో పాటు ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదుకు సంబంధించి తమ పరిధిలోని బి ఎల్ ఓ లను సంప్రదించి ఫారం6ను సమర్పించాలని జిపిఓ నాగరాజు సూచించారు.పిఎస్ 79, 80, 81, 83 పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బి ఎల్ ఓ లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఐపీసీ చైర్మన్‌ను కలిసిన జిల్లెల ఆదిత్య రెడ్డి

- **సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ చర్చ**

హైదరాబాద్,సెప్టెంబర్13(తెలంగాణ ముచ్చట్లు): అఖిల భారత వృత్తి నిపుణుల కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మధు యాష్కీ గౌడ్‌ను ఏఐపీసీ రాష్ట్ర అధ్యక్షులు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంస్థను మరింత బలోపేతం చేయడం, భవిష్యత్ కార్యాచరణ, వృత్తి నిపుణులను విస్తృతంగా భాగస్వాములను చేయడం తదితర అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వృత్తి నిపుణుల భాగస్వామ్యాన్ని పెంచుతూ సంస్థను మరింత క్రియాశీలంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.వృత్తి నిపుణుల సూచనలు, అనుభవాలను ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని చర్చించారు. సంస్థాగతంగా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేస్తూ ఏఐపీసీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

భక్తితో వినాయకుడిని పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

- **పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు):కరీంనగర్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.
అదేవిధంగా 22వ, 50వ డివిజన్ల పరిధిలోని చైతన్యపురి కాలనీ, 14వ డివిజన్ చింతకుంటలో నిర్వహించిన ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాల్లోనూ మేయర్ పాల్గొని ప్రజలకు విగ్రహాలను అందజేశారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు.
రసాయనాలు, హానికర పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతులనే వినియోగించాలని సూచించారు.
"పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. మట్టి గణపతుల ప్రతిష్టాపనతో పచ్చని కరీంనగర్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని మేయర్ పిలుపునిచ్చారు. నగరంలోని అన్ని డివిజన్లలో మట్టి గణపతి విగ్రహాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. కరీంనగర్‌ను పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటూనే ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని మేయర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, గడ్డి ప్రదీప్, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలే ప్రథమ ప్రాధాన్యం

- **12వ డివిజన్‌లో అభివృద్ధికి మరో అడుగు**
- **తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం: మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ హస్నాపూర్ ప్రాంతంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న హెచ్‌డీపీఈ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన చేశారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ-వేణుతో కలిసి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పైప్‌లైన్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు అందించడంతో పాటు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కార గ్రహీత నక్క విష్ణుకు ఘన సన్మానం

వనపర్తి,సెప్టెంబర్13(తెలంగాణ ముచ్చట్లు):కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బొమ్మలపల్లకి వీడియోగ్రఫీ పోటీల్లో ద్వితీయ బహుమతితో ప్రతిభా పురస్కారం అందుకున్న నక్క విష్ణును సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఆదివారం స్థానిక రేడియంట్ హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీరంగాపురంపై నక్క విష్ణు రూపొందించిన లఘు చిత్రానికి పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ప్రతిభా పురస్కార ప్రశంసాపత్రంతో పాటు శాలువా, రూ.6 వేల నగదు బహుమతిని అందజేసినట్లు తెలిపారు.వనపర్తి జిల్లాలో ఎన్నో ప్రాచీన కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు ఉన్నాయని, వాటి విశిష్టతను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యువత తమ ప్రతిభను చాటుకునేలా ప్రోత్సహించాలని, పురస్కారాలు కళాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం జిల్లా కన్వీనర్ డా. బైరోజు శ్యాంసుందర్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, డా. కంటే నిరంజనయ్య, బండారు శ్రీనివాస్, డా. తూర్పింటి సరేశ్‌కుమార్, పెరుమాళ్ల శ్రీనివాస్, దేశి రాములు, యాదవ్ దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల అశోక్ రెడ్డి**

స్టేషన్ ఘన్ పూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొందిన చారిత్రాత్మక సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్టేషన్ ఘన్ పూర్ పట్టణంలోని మా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం అప్పట్లో భారత యూనియన్‌లో విలీనం కాలేదని, అనంతరం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని అశోక్ రెడ్డి గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులు, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఈ విముక్తి సాధ్యమైందన్నారు. ఖాసిం రజ్వీ, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటాన్ని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన అవసరం ఉందన్నారు.గత ప్రభుత్వాలు సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యతను సరైన రీతిలో గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సెప్టెంబర్ 17ను కేవలం తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా ప్రకటించి, అన్ని జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని కోరారు. సెప్టెంబర్ 17 చారిత్రక నేపథ్యం, తెలంగాణ విమోచన పోరాటం, అమరవీరుల త్యాగాల గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి, స్టేషన్ ఘన్ పూర్, జాఫర్‌గఢ్, చిల్పూర్ మండలాల అధ్యక్షులు సట్ల వెంకటరమణ, కోరుకుప్పుల నాగేష్, గంటే ఉపేందర్ యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు రాదపాక ప్రదీప్, నాయకులు రాజ్ కుమార్, ఎల్లయ్య, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ కమిటీకి తీవ్ర పోటీ

- **అనుబంధ కమిటీల ఏర్పాటుకు 100 దరఖాస్తులు**

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీతో పాటు అనుబంధ కమిటీల ఏర్పాటుకు నాయకుల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీల ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు.పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు అధ్యక్షతన, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పూర్తిస్థాయి పట్టణ కమిటీతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా కమిటీలను ఏర్పాటు చేసేందుకు నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు పట్టణ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివిధ కమిటీల పదవుల కోసం పోటీలో ఉన్న నాయకుల నుంచి 100 దరఖాస్తులు అందాయని వెల్లడించారు.పదవుల కోసం పోటీ ఎక్కువగా ఉండటంతో అందిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి, పార్టీ నాయకులతో చర్చించిన అనంతరం తుది జాబితాను ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అందజేస్తామని వారు తెలిపారు. పార్టీ కోసం చురుగ్గా పనిచేస్తున్న వారికి, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులకు కమిటీల్లో ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు బొల్లు లక్ష్మీ, పొన్న రవి, సోదరపల్లి సంపత్ రాజ్, 18 డివిజన్ల అధ్యక్షులు, తిరుమలనాథ దేవస్థానం చైర్మన్ నీల నర్సింహులు, డైరెక్టర్ ప్రశాంత్, జిల్లా నాయకులు బూర్ల శంకర్, నీల గట్టయ్య, పోగుల సారంగపాణి, పెసరు సారయ్య, పోశాల కృష్ణ, రాఘవరెడ్డి, గండ్ల రాజు, సత్తు రవి, ఐలపాక శ్రీను, అన్నెపు కుమార్, తోకల రాజు, గుర్రం రమేష్, అంగడి కృష్ణతో పాటు మహిళా, యువజన నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం

- **14వ వార్డులో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని 14వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి-సారయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని వారు పిలుపునిచ్చారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని మా గార్డెన్ సమీపంలో పెసరు కృష్ణవేణి-సారయ్య ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, యువత, మహిళలకు మట్టి విగ్రహాలను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పండుగ సంప్రదాయాన్ని కొనసాగించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో చెరువులు, కుంటలు కలుషితం కాకుండా ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.“మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం” అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గడ్డాల శేఖర్, గట్టు సురేందర్, లత, అశోక్, పద్మ, కొంగరి రమేష్, వల్లాల పల్లవి, నిర్మల, సౌమ్య, రుద్రమదేవి, రమ, పెండ్యాల నరసయ్య, రాజమ్మ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నివాస్ కుటుంబానికి ఎస్ఎస్ గ్రూప్ చేయూత

- **25 కేజీల బియ్యం అందజేసిన సభ్యులు**

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కలకోటి నివాస్ కుటుంబానికి ఎస్ఎస్ (సింగపురం సహకారం) గ్రూప్ సభ్యులు అండగా నిలిచారు. ఆదివారం నివాస్ కుటుంబాన్ని పరామర్శించిన ఎస్ఎస్ గ్రూప్ సభ్యులు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కష్టకాలంలో నివాస్ కుటుంబానికి తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చినట్లు ఎస్ఎస్ గ్రూప్ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ గ్రూప్ సభ్యులు సింగపురం రాజేందర్, సింగపురం (బలగం) ప్రవీణ్, సింగపురం కిట్టు, ప్రతీష్, బాబు, చింటూ, చందు, కేఫా, టింకులు, నిశాంత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భద్రతలో సీసీటీవీల పాత్ర గొప్పది

- **నస్రుల్లాబాద్ ఎస్సై వెంకటరావు**

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని నస్రుల్లాబాద్ మండల ఎస్సై వెంకటరావు అన్నారు. యువత దేశ భద్రత, ప్రజా రక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటి), కామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీసీటీవీ కెమెరా శిక్షణ రెండో బ్యాచ్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై వెంకటరావు దీప ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో దేశ భద్రత విషయంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ప్రజల రక్షణతో పాటు నేరాల గుర్తింపు, నియంత్రణ, దర్యాప్తులో సీసీటీవీ కెమెరాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఆర్‌సెటి సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. ఆర్‌సెటి సంస్థ డైరెక్టర్ అమర్ సింగ్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందే దిశగా యువత ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్‌టీ సురేష్, అధ్యాపకులు జీవన్ నాయక్, సూర్యతేజ, సంస్థ ప్రతినిధులు సార్థిక, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- **ఈ నెల 17 నుంచి మూడో బ్యాచ్ శిక్షణ ప్రారంభం**

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటి) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మగ్గం వర్క్ ఉచిత శిక్షణ మూడో బ్యాచ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ అమర్ సింగ్ తెలిపారు.

ఈ నెల 17వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, 6 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని మంగళవారం నుంచి నస్రుల్లాబాద్‌లోని ఆర్‌సెటి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ పొందడంతో పాటు శిక్షణ అనంతరం స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు: 9247540478 నంబర్‌ను సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ అమర్ సింగ్ కోరారు.

ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటుపై రఘునాథ్ కాలనీ వాసుల ఆందోళన

- **పనులను అడ్డుకుని పోలీసులకు సమాచారం..**
- **టవర్ నిర్మాణాన్ని నిలిపివేసిన పోలీసులు**

వరంగల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 29వ డివిజన్ రఘునాథ్ కాలనీలో ఇళ్ల మధ్య ప్రైవేటు సంస్థకు చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు అక్కడికి చేరుకుని టవర్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు.

ఇళ్ల మధ్యలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల తమకు ఇబ్బందులు కలుగుతాయని, టవర్ నుంచి వెలువడే రేడియేషన్ కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నివాస ప్రాంతాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయకుండా వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి, టవర్‌ను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని స్థానికులు మట్టవాడ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. పరిస్థితిని సద్దుమణిగేలా చేసి, సెల్ టవర్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయించారు.

ఈ సందర్భంగా రఘునాథ్ కాలనీ వాసులు మాట్లాడుతూ.. తమ నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయనే ఆందోళన తమలో ఉందన్నారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని అధికారులను కోరారు.ఈ ఆందోళనలో రఘునాథ్ కాలనీకి చెందిన సదాంత్ కొడకండ్ల, మాముూరి రాజు, గాలయ్య, ఇజగిరి భీమరాజ్, శివకుమార్, రాజు, ప్రమోద్, రాజేందర్ తదితరులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

శ్రీ రామాంజనేయ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- **అధ్యక్షుడిగా సిల్ల వినోద్ ఏకగ్రీవ ఎన్నిక**

కరీంనగర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూరులో శ్రీ రామాంజనేయ ఆటో యూనియన్ కార్యవర్గ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షుడిగా సిల్ల వినోద్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కన్నం భూమేష్, ప్రధాన కార్యదర్శిగా సిరిసిల్ల శ్రీనివాస్, కోశాధికారిగా పంగ రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సిల్ల వినోద్ మాట్లాడుతూ.. 2018లో ఏర్పాటైన శ్రీ రామాంజనేయ ఆటో యూనియన్ సభ్యులందరి సహకారంతో విజయవంతంగా కొనసాగుతోందన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఆటో కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, యూనియన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకుని వారికి అన్ని విధాలా అండగా నిలవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నూతన కార్యవర్గ ఎన్నిక పట్ల యూనియన్ సభ్యులు, స్థానిక ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతన సీసీ, పీఆర్వో నియామకం

- **వేణుగోపాల్ రావు, మోహన కృష్ణలకు బదిలీ ఉత్తర్వులు**

వరంగల్,సెప్టెంబర్13(తెలంగాణ ముచ్చట్లు): వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్యాంపు క్లర్క్ (సీసీ) వేణుగోపాల్ రావు, పౌర సంబంధాల అధికారి (పీఆర్వో) మోహన కృష్ణలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారిక సమాచారం. వేణుగోపాల్ రావును వరంగల్ రేంజ్ డీఐజీ కార్యాలయానికి,మోహన కృష్ణను స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. వారి స్థానాల్లో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏవోగా పనిచేస్తున్న ఇషాక్‌ను సీసీగా, సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతిని పీఆర్వోగా నియమించినట్లు అధికారులు తెలిపారు.వేణుగోపాల్ రావు, మోహన కృష్ణ ఒకే పోస్టింగ్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారంటూ గతంలో కొన్ని ఆరోపణలు, వార్తా కథనాలు వెలువడినట్లు సమాచారం. ఈ అంశంపై పోలీస్ శాఖ అంతర్గతంగా విచారణ జరిపిందా, బదిలీలు ఆ విచారణ ఫలితంగా జరిగాయా అనే విషయంపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉత్తర్వుల ప్రకారం, అధికారుల పరిపాలనా అవసరాల మేరకు బదిలీలు, నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

ముల్కనూర్ సహకార ప్రగతిపై గ్రూప్–2 అధికారులకు అవగాహన

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-2 అధికారుల కోసం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంయుక్త ఫౌండేషన్ కోర్సులో భాగంగా సుమారు 220 మంది అధికారులు ముల్కనూర్ కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీని సందర్శించారు. రెండు బ్యాచ్‌లుగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఈ పర్యటన జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్ సంస్థ చరిత్ర, పరిపాలనా విధానం, రైతులకు అందిస్తున్న రుణ సేవలు, విత్తన ఉత్పత్తి-మార్కెటింగ్, రైస్ మిల్లులు, కాటన్ జిన్నింగ్, గోదాములు, వ్యవసాయ ఇన్‌పుట్స్, బీమా తదితర కార్యకలాపాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం సొసైటీ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధికారులతో సమావేశమై ముల్కనూర్ సహకార నమూనా, ఆర్థిక క్రమశిక్షణ, రుణాల రికవరీ, మార్కెట్ ఆధారిత కార్యకలాపాలు, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలను వివరించారు. ఆధునిక వ్యవసాయంలో ఏఐ, ఉపగ్రహ పర్యవేక్షణ, డ్రోన్ సాంకేతికత వినియోగంతో రైతుల ఆదాయం, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచే అవకాశాలపై చర్చించారు.ప్రభుత్వ అధికారులు రైతులు, ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని, వారి పనులు, ఫైళ్ల పరిష్కారంలో వేగం, పారదర్శకతతో పనిచేయాలని ప్రవీణ్ రెడ్డి సూచించారు. అనంతరం అధికారుల భవిష్యత్ విధి నిర్వహణకు శుభాకాంక్షలు తెలిపారు. ముల్కనూర్ సహకార నమూనాను ప్రత్యక్షంగా పరిశీలించడం గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, సహకార రంగంపై తమకు ఎంతో ఉపయోగకరమైన అనుభవాన్ని అందించిందని గ్రూప్-2 అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ జనరల్ మేనేజర్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పై అభిమానం చాటుకున్న వార్డు సభ్యుడు

- **ఇంటి గోడపై మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని గీయించుకున్న కొమ్ము బ్రహ్మయ్య**

పెద్దమందడి,సెప్టెంబర్13(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ఉద్యమ నేత, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తనకున్న అభిమానాన్ని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం 7వ వార్డు సభ్యుడు కొమ్ము బ్రహ్మయ్య వినూత్నంగా చాటుకున్నారు.తన అభిమాన నాయకుడు కేసీఆర్ చిత్రపటాన్ని తన ఇంటి గోడపై అందంగా చిత్రీకరించుకుని అభిమానాన్ని చాటుకున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటం, ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్ర తనను ఎంతగానో ప్రభావితం చేసిందని బ్రహ్మయ్య తెలిపారు. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతోనే ఇంటి గోడపై ఆయన చిత్రాన్ని ప్రత్యేకంగా గీయించుకున్నట్లు చెప్పారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమం, రాష్ట్ర సాధనతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ విధంగా వ్యక్తపరిచినట్లు పేర్కొన్నారు.ఇంటి గోడపై చిత్రీకరించిన కేసీఆర్ చిత్రపటం స్థానికంగా పలువురిని ఆకట్టుకుంటోంది. నాయకుడిపై ఉన్న అభిమానాన్ని వినూత్న రీతిలో వ్యక్తపరిచిన బ్రహ్మయ్యను పలువురు అభినందించారు.ఈ గోడ చిత్రాన్ని ప్రారంభించిన కార్యక్రమంలో మాజీ వనపర్తి జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు టీ. సేనాపతి, ఉపాధ్యక్షుడు జంగం రమేష్, అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. వార్డు సభ్యులు సింగిరెడ్డి అమల, కొమ్ము విష్ణు, ఆంజనేయులు, మౌగిలయ్య, వెంకటయ్య, బాల నాగన్న, సింగిరెడ్డి నాగరాజు, కూడుకుంట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
సోమవారం - 14 - సెప్టెంబర్ - 2026

‘కల్పిత నాయకుడు’ పుస్తకాన్ని వెంటనే నిషేధించాలి

- **డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై ‘కల్పిత నాయకుడు’ పేరుతో పుస్తకం రాసిన అమర్ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిషేధించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు.ఇందిరా పార్క్ వద్ద దళిత సమాజానికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో కులాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అభ్యంతర కరమైన సాహిత్యంతో పుస్తకం రాయడం దళిత సమాజాన్ని తీవ్రంగా బాధించిందన్నారు.
ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ‘కల్పిత నాయకుడు’ పుస్తకాన్ని నిషేధించాలని కోరారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతామని పిడమర్తి రవి హెచ్చరించారు.
ఇటీవల దళిత సమాజానికి సంబంధించిన అంశాలపై బీఆర్ఎస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ కేసీఆర్, కేటీఆర్‌లు దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన భాగంగా ఉన్న దళిత సమాజాన్ని అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, కేఆర్ నాగరాజు, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, సతీష్ మాదిగ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, మీసాల మహేష్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ అందజేత

- **దాతృత్వాన్ని చాటుకున్న కుమారుడు**

చిల్వూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): తల్లిదండ్రులపై ఉన్న ప్రేమను, పుట్టిన గ్రామంపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ ఓ కుమారుడు చేసిన సేవా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్ తన తల్లిదండ్రులు కీ.శే. బత్తుల వెంకట్రాద్రి, కీ.శే. వెంకటలక్ష్మి జ్ఞాపకార్థంగా గ్రామపంచాయతీకి డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు.
ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటం రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామపంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన గ్రామానికి తనవంతుగా సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు.
అనంతరం గ్రామస్తులు, యువకులు ప్రభాకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోటం రాజు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో ఉపయోగపడే ఫ్రీజర్ బాక్స్‌ను అందజేయడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బత్తుల ప్రతిమ ప్రభాకర్, గ్రామస్తులు కర్ణాకర్ శర్మ, బత్తుల సూర్యనారాయణ, కర్ణాల యాదగిరి, మారేపల్లి రాజేందర్ రెడ్డి, రఘు రెడ్డి, సంగి రాములు, కర్నాల వెంకటయ్య, వేరేవాళ్లు సుదర్శన్, కన్నెబోయిన రాజు (ఎలక్ట్రిషన్), అక్బర్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్‌లో ఘనంగా ఎంఈఎఫ్ నియోజకవర్గ సదస్సు

- **మాదిగ ఉద్యోగులను సమీకరించి జాతి చైతన్యానికి కృషి: తాండ్ర నర్సన్న**

హుజురాబాద్, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు):హుజురాబాద్‌లో మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) నియోజకవర్గ సదస్సు ఆదివారం డాక్టర్ తడికమళ్ళ శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు తాండ్ర నర్సన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా తాండ్ర నర్సన్న మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ ఉద్యోగులను సమీకరించి, జాతిని చైతన్యపరిచేందుకు ఉద్యోగుల నిర్మాణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా గ్రామస్థాయి లో పనిచేసేందుకు ఉద్యోగులను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. సదస్సులో ఎంఈఎఫ్ హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా గొర్రె చిరంజీవి, కోకన్వీనర్లుగా చల్లూరు రాజయ్య, బండ మోహన్, అంబాల రవీందర్లను గుర్తించారు. హుజురాబాద్ మండల కన్వీనర్‌గా రొంటాల సుమన్, కోకన్వీనర్లుగా రుద్రారపు కుమార్, ముక్క రాజేందర్లను నియమించారు.జమ్మికుంట మండల కన్వీనర్‌గా గంగారపు రాజయ్య, కోకన్వీనర్‌గా పుల్లూరు సంపత్; సైదాపూర్ మండల కన్వీనర్‌గా కనకం వెంకటస్వామి, కోకన్వీనర్లుగా మిడిదొడ్డి సంపత్, దానంపల్లి ఐలయ్య, రుద్రారపు స్వామిలను గుర్తించారు. కేశవపట్నం మండల కన్వీనర్‌గా పి. కోటిని గుర్తించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రుద్రారపు రామచంద్రం, మారేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్. కృష్ణయ్య 72వ జన్మదిన వేడుకలు

- **బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు**

హుజురాబాద్, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య 72వ జన్మదిన వేడుకలను హుజురాబాద్ నియోజకవర్గ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.హుజురాబాద్ పట్టణంలోని స్థానిక జేఏస్ఎస్ కార్యాలయంలో బీసీ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు సందేల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఆర్. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, గత ఐదు దశాబ్దాలుగా బీసీల అభ్యున్నతి కోసం ఆర్. కృష్ణయ్య అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. 1994లో బీసీ జాతీయ సంక్షేమ సంఘాన్ని స్థాపించి బలహీనవర్గాల్లో చైతన్యం తీసుకువస్తూ, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారని అన్నారు. బీసీలకు ఆర్. కృష్ణయ్య ఆశాజ్యోతిగా నిలిచారని పేర్కొన్నారు.
ఆర్. కృష్ణయ్యను ఆదర్శంగా తీసుకుని బీసీ లందరూ ఐక్యంగా ఉద్యమించాలని, స్థానిక సంస్థలు, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికారం కోసం మరింత బలమైన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.
ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, మంచికట్ల మురళి, బుర్ర కుమార్, ఆకుల సదానందం, మామునూరు ప్రవీణ్ కుమార్, మంద బిక్షపతి, కన్నెబోయిన రాజయ్య, సబ్బని రాజేందర్, పిట్ట శ్రీనివాస్, ఎండి బాబా, గుడాల రాజారాం, మంచికట్ల విజయ్, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొని ఆర్. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆనాటి స్నేహం.. ఈనాటి ఆత్మీయత

- **ఏళ్ల దూరాన్ని చెరిపేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

హుజురాబాద్,సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): పాఠశాల ప్రాంగణంలో కలిసి చదువుకున్న రోజులు.. ఒకే బెంచిపై కూర్చొని పంచుకున్న సరదాలు.. పరీక్షల సమయంలో కలిసిన ఒత్తిళ్లు.. ఆటపాటల్లో కలిసి చేసిన అల్లరి.. ఇలా ఎన్నో మధుర జ్ఞాపకాలను మోసుకొస్తున్న బాల్య స్నేహితులు 37 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట చేరారు. 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో ఉత్సాహంగా, భావోద్వేగంగా జరిగింది.
ఏళ్ల దూరం.. క్షణాల్లో మాయం
జీవితంలో ఎవరి దారిలో వారు ప్రయాణిస్తూ.. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమైన స్నేహితులు చాలాకాలం తర్వాత ఒకరినొకరు కలుసుకున్నారు. ఇంతకాలం తర్వాత ఎదురెదురుగా నిలబడగానే పాత పరిచయం ఒక్కసారిగా గుర్తుకొచ్చింది. పేర్లు, పిలుపులు, పాఠశాల రోజుల సంఘటనలను గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంవత్సరాలు గడిచినా మనసుల్లోని స్నేహం మాత్రం చెక్కుచెదరలేదని ఈ కలయిక నిరూపించింది.
నాటి జ్ఞాపకాల్లో మళ్లీ బాల్యానికి
సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదిలో జరిగిన సరదా సంఘటనలు, ఉపాధ్యాయుల మందలింపులు, స్నేహితులతో కలిసి గడిపిన సమయాలు, పరీక్షల సమయంలో ఒకరికొకరు ఇచ్చుకున్న సహాయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ జ్ఞాపకాలను పంచుకుంటూ కొందరు నవ్వుల్లో మునిగితే.. మరికొందరు పాత మిత్రులను చూసిన ఆనందంలో భావోద్వేగానికి గురయ్యారు.
గురువులకు ఘన సన్మానం
తమ జీవితాలకు విద్యతో పాటు మంచి విలువలను అందించిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువుల ఆశీస్సులు తీసుకుని, తమ జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషించిన పాత్రను గుర్తుచేసుకున్నారు. గురువులను ఇంతకాలం తర్వాత కలిసి సన్మానించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.
స్నేహబంధానికి వేదికగా ఆత్మీయ సమ్మేళనం
ఈ సమ్మేళనం కేవలం పూర్వ విద్యార్థుల కలయికగా కాకుండా.. చిన్ననాటి స్నేహాలను మరోసారి గుర్తుచేసుకునే ఆత్మీయ వేదికగా నిలిచింది. వయసు పెరిగినా.. బాధ్యతలు మారినా.. పరిస్థితులు మారినా.. బాల్యంలో ఏర్పడిన స్నేహబంధం మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమేనని పలువురు పేర్కొన్నారు.ఒకరినొకరు కుటుంబ సభ్యుల గురించి అడిగి తెలుసుకుంటూ ఆప్యాయతను పంచుకున్నారు. మళ్లీ కలుద్దాం.. స్నేహాన్ని కొనసాగిద్దాం
సమ్మేళనం సందర్భంగా పూర్వ విద్యార్థులంతా కలిసి ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు. ఇకపై ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను తరచూ నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. జీవితంలో ఎన్నో విజయాలు సాధించినా.. బాల్య స్నేహితులతో గడిపిన క్షణాలకు ప్రత్యేకమైన విలువ ఉంటుందని వారు పేర్కొన్నారు.
37 ఏళ్ల కాలాన్ని వెనక్కి నెట్టి.. ఒక్కరోజులో మళ్లీ బాల్యాన్ని ఆస్వాదించిన ఈ ఆత్మీయ కలయిక పూర్వ విద్యార్థుల జీవితాల్లో ఎప్పటికీ చెరిగిపోని మధుర జ్ఞాపకంగా నిలిచింది.

రబీకి రెడీ అవుతున్న రైతులు.. కేంద్రం కీలక సూచనలు!

- **జమ్మికుంట కేవీకేలో ప్రత్యక్ష ప్రసారం**

జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): రాబోయే రబీ సీజన్‌లో రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సూచించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కేంద్ర మంత్రి లైవ్ వెబ్‌కాస్ట్ కార్యక్రమాన్ని స్థానిక రైతులకు ప్రత్యక్ష ప్రసారం చేశారు.
కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు పురుష, మహిళా రైతులు ఆసక్తిగా పాల్గొని కేంద్ర మంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా రబీ సాగుకు సంబంధించి పలు ముఖ్యమైన సూచనలు, మార్గదర్శకాలను మంత్రి వివరించారు.
వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని, విత్తనశుద్ధిని తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. నేల పరీక్షల నివేదికల ఆధారంగానే సమతుల్య ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు సహజ వ్యవసాయ విధానాలు, జల సంరక్షణ పద్ధతులను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.
రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.
వెబ్‌కాస్ట్ అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను కేవీకే శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. రబీ పంటల సాగు, విత్తన ఎంపిక, ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులకు అవసరమైన సూచనలు అందించారు.
కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, హెడ్, వివిధ విభాగాల విషయ నిపుణులు, సిబ్బంది, కరీంనగర్ జిల్లాకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకాలకు.. సేవా స్మారకం!

- **హనుమాన్ ఆలయానికి రూ.24 వేలతో కమాన్ నిర్మించిన తోట కుటుంబం**

జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): తల్లిదండ్రుల జ్ఞాపకాలను పదిలపరుచుకోవడంతో పాటు గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో తనుగుల గ్రామానికి చెందిన ఓ కుటుంబం చేపట్టిన సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన స్వర్గీయ తోట రాయలింగు-ఆగమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి వారసులు హనుమాన్ దేవాలయం వద్ద రూ.24 వేల వ్యయంతో ఇనుప కమాన్‌ను నిర్మించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ కమాన్‌ను రహదారి ద్వారం వద్ద ఏర్పాటు చేశారు.
గతంలో మెయిన్ రోడ్డు నుంచి హనుమాన్ దేవాలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్న సమయంలో గ్రామ పెద్దల విజ్ఞప్తి మేరకు తోట రాయలింగు-ఆగమ్మ కుటుంబ సభ్యులు రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందించారు. ప్రస్తుతం వారి జ్ఞాపకార్థం దేవాలయ ప్రవేశద్వారం వద్ద కమాన్ ఏర్పాటు చేయడం ద్వారా తమ కుటుంబానికి గ్రామంతో ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ జక్కే కిరణ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి, ప్రజా సేవకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో తోట కుటుంబ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.
సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్ మాట్లాడుతూ.. తోట కుటుంబ సభ్యులు గతంలోనూ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లు అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.
కార్యక్రమంలో గ్రామ పురోహితులు వల్లూరి పవన్ కుమార్, విష్ణు అయ్యగారు, వాసాల సుధీర్, దేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, యాదకిషన్, రాజు, దాసారపు రాజయ్య, ప్రశాంత్, సంజీవ్, సంపత్, కొమురయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు తోట రాజు, సరిత, లక్ష్మీ ప్రియ, ఈశ్వర్ కార్తీక్, స్వరూప, కౌటమ్ రాజ్ కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

నాటి జ్ఞాపకాలు.. నేడు ఆత్మీయ కలయిక!

- **బిజిగిరి షరీఫ్‌లో 1992–93 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): చిన్ననాటి స్నేహాలు.. గురువుల బోధనలు.. పాఠశాల ప్రాంగణంలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ 1992-93 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల్లోని అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతూ బాల్య స్నేహాన్ని మరోసారి చాటుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకోవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన రాజిరెడ్డి, రాజగోపాల్, నర్సింహారెడ్డి, వెంకటేశ్వరచారి, చంద్రమోహన్, రాజేశం తదితర గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో గురువులను సత్కరించి తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకున్నారు.

కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్, మహేందర్, సంపత్రావు, జలీల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, వీరేశలింగం, పోచయ్య, ఉమారాణి, స్వరూప, విజయ, ధనలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

లచ్చగూడెంలో డీజే సీజ్..

- **ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఎస్ ఐ జి నరేష్.**

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో అదివారం రాత్రి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డీజే సౌండ్‌పై చింతకాని ఎస్ ఐ నరేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి డీజీ ని సీజ్ చేశారు. డీజే నిర్వాహకులు గోగుల నాగరాజు, గంగుంట్ల రాము అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.మండలంలో డీజే నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి అని పోలీసులు తెలిపారు.అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని చింతకాని ఎస్ ఐ జి నరేష్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో డీజే సౌండ్స్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి లచ్చగూడెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఎస్ ఐ నరేష్ దృష్టికి తీసుకొచ్చారు ఇట్టి చర్యలో భాగంగా డీజే సౌండ్స్ ను చెక్ పెట్టే విధంగా చర్యలు చేపడుతుండటంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు: పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని,పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ,మట్టి గణేష్ విగ్రహాలను వినియోగిద్దాం...పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకుందామన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

అరుదైన బంగారు వినాయకుడు..

హైదరాబాద్ , సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): ఈసారి వినాయక చవితికి నగరంలోని ఓ జువెల్లరీ దుకాణం వినూత్న రీతిలో గణేశ్ విగ్రహాన్ని రూపొందించింది. చాలా భక్త సంఘాలు పర్యావరణం కోసం మట్టి వినాయకులను ప్రతిష్ఠిస్తే బేగంబజార్‌లోని లీచీ పెరల్స్ అండ్ జువెల్స్ అనే దుకాణం మాత్రం గోల్డెన్ అండ్ డైమండ్ గణేశ్ విగ్రహాన్ని (నెలకొల్పింది. పూర్తిగా 24 క్యారెట్ల బంగారం, అమెరికా వజ్రాలతో అటు ముంబైలోని గణేశ్ రూపం, ఇటు తిరుమలలోని వెంకటేశ్వరస్వామి ఇమిటేషన్‌తో ఈ విగ్రహాన్ని రూపొందించింది. ఈ విగ్రహం తయారీ కోసం మొత్తం ఎంత బంగారాన్ని వాడిన సంగతిని నిర్వాహకులు వెల్లడించలేదు.

దళితబంధు నిధుల విడుదలకు కృషి

- **హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్**

జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): దళితబంధు పథకం లబ్ధిదారులకు త్వరలోనే నిధుల విడుదల ప్రక్రియ ప్రారంభిస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ప్రకటించారు. దళితుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు.

ఆదివారం జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్స్‌లో మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, వొడితల ప్రణవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ అంశంలో ముందడుగు వేశామని తెలిపారు. దళిత స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం, ఆయన పర్యటించిన ప్రాంతాన్ని శుద్ధి పేరుతో పసుపునీటితో శుభ్రం చేయడం వంటి ఘటనలపై బీఆర్ఎస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ప్రణవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పెండింగ్‌లో ఉన్న దళితబంధు లబ్ధిదారుల అంశంపై దృష్టి సారించి, 2025లో గ్రౌండింగ్ ప్రక్రియను తిరిగి చేపట్టామని తెలిపారు. దళితబంధు నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ ప్రక్రియను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు కొనసాగుతున్నాయని ప్రణవ్ వెల్లడించారు. ఆయన ప్రకటనతో దళితబంధు లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.ఈ సందర్భంగా మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ.. దళితబంధు నిధుల విడుదల కోసం వొడితల ప్రణవ్ మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులను కలిసి కృషి చేస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో మాదిగ మహాశక్తి నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, దళితబంధు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు 'సంకల్పం ఆపన్నహస్తం'

- **ఖమ్మంలో డాక్టర్ దండమూడి రమణ బృందం మానవీయ సేవలు**
- **ఉచిత వైద్య పరీక్షలతో భరోసా.. చిన్నారుల ఆరోగ్యానికి వైద్యుల ఆపన్నహస్తం**

ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): రక్తం తక్కువై ప్రాణంపోతున్న పసిమొగ్గల్లో ఆశల వెలుగులు నింపేందుకు, వారి శ్వాసకు స్వచ్ఛమైన ఆయువు నందించేందుకు ఖమ్మంలో ఒక అద్భుతమైన మానవతా పర్వం ఆవిష్కృతమైంది. జన్మతః తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారులకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీకారం చుట్టిన ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం అనేక కుటుంబాల్లో వెలుగులు నింపింది.

హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ దండమూడి రమణ తన హృదయపూర్వక వైద్య బృందంతో కలిసి ప్రతీ చిన్నారిని కంటికి రెప్పలా పరీక్షించారు. చిన్నారుల రక్త పరీక్షలు, స్కానింగ్ రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి అవసరమైన అత్యంత విలువైన మందులను సూచించి కొండంత ధైర్యాన్ని అందించారు.

ఈ సందర్భంగా

డాక్టర్ దండమూడి రమణ మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించే మందులను క్రమం తప్పకుండా వాడించాలని సూచించారు. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని 8 శాతం కంటే తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హిమోగ్లోబిన్ స్థాయి తగ్గినప్పుడు చిన్నారులు త్వరగా అలసటకు గురవడంతో పాటు, దాని ప్రభావం శరీరంలోని ఇతర అవయవాలపై పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అవసరమైన సమయంలో రక్తం ఎక్కించడంతో పాటు, వైద్యుల సూచనల మేరకు మందులను సమయానికి అందించాలని తెలిపారు.

తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సహాయం అందించడం కేవలం చికిత్స మాత్రమే కాదని.. వారి కుటుంబాలకు "మీ వెంట మేమున్నాం" అనే భరోసా కల్పించడమేనని సంకల్ప సంస్థ ప్రతినిధులు పి. రవిచందర్, పి. అనిత, పి. పావని తెలిపారు. రక్తం కోసం, వైద్యం కోసం నిరంతరం ఎదురుచూసే చిన్నారులకు ఇలాంటి ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, వారి భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవీయ దృక్పథంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ బాధ్యులు కంటమనేని రాజగోపాల్, డాక్టర్ ఎం. సోహితరెడ్డి, డాక్టర్ రుచిత, డాక్టర్ శరత్, రేడియాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ నారాయణమూర్తి, సంకల్ప సంస్థ బాధ్యులు పి. రవిచందర్, పి. అనిత, పి. పావని తదితరులు, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ దర్శనాలకు ప్రత్యేక బస్సులు

- **నాగిరెడ్డి ప్రకటనతో భక్తులకు ఊరట**
- **ఖైరతాబాద్, బాలాపూర్ గణపతి దర్శనాల కోసం ప్రత్యేక సర్వీసులు**
- **సెప్టెంబర్ 14 నుంచి 24 వరకు బస్సుల నిర్వహణ**
- **భక్తుల రద్దీ దృష్ట్యా టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు**

హైదరాబాద్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): వినాయక నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రముఖ గణపతి మండపాల దర్శనానికి వెళ్లే భక్తుల కోసం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి తెలిపారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణపతి మండపాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 14 నుంచి 24వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సులభంగా గణపతి మండపాలకు చేరుకునేలా ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రతి సంవత్సరం ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ గణపతి దర్శనాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రద్దీ సమయాల్లో అదనపు సర్వీసులను కూడా నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రత్యేక బస్సుల నిర్వహణతో భక్తులు సొంత వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు వీలైనంత వరకు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకునేలా సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.

ఖమ్మంలో జనసేన శంఖారావం సభ

- **గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభమైన కార్యక్రమం**
- **ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీతో జనసేన శ్రేణుల శక్తి ప్రదర్శన**
- **తెలంగాణ నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు**
- **పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

ఖమ్మం, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): జనసేన పార్టీ నిర్వహించిన "జనసేన తెలంగాణ శంఖారావం" సభ ఖమ్మంలోని ఎంబీ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో అట్టహాసంగా ప్రారంభమైంది. "పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం" వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది నాయకులు, జనసైనికులు, వీర మహిళలు హాజరయ్యారు. సభ ప్రాంగణం జనసేన జెండాలు, నినాదాలతో సందడిగా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించారు. కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, రాధారం రాజలింగం, తనీష్ అల్లాడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

సభకు ముందు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీ ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఖమ్మం బైపాస్ రోడ్ మీదుగా ర్యాలీగా ఎంబీ ఫంక్షన్ హాల్ వరకు చేరుకున్నారు. ర్యాలీ సందర్భంగా జనసేన పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి శంఖారావం సభలు వేదికలుగా మారనున్నాయని నాయకులు వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటమే జనసేన లక్ష్యమని స్పష్టం చేశారు. ఖమ్మంలో నిర్వహించిన ఈ శంఖారావం సభ జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పార్టీ విస్తరణకు ఇది కీలక మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. సభ విజయవంతం కావడంతో పాటు రాబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 14 - సెప్టెంబర్ 2026
వరంగల్ 07

వినాయక చవితి: భక్తి, సంస్కృతి, ప్రకృతి పరిరక్షణకు ప్రతీక

- భక్తి నుంచి సామాజిక చైతన్యం వరకు
- మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ

డెస్క్, సెప్టెంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): భారతీయ సంస్కృతిలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో వినాయక చవితి ఒకటి. భాద్రపద శుద్ధ చవితి రోజున జరుపుకునే ఈ పండుగను గణేశుడి జన్మదినంగా భావిస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 14న వినాయక చవితి వేడుకలు ప్రారంభమవుతున్నాయి. గణపతి బప్పాను విఘ్నేశ్వరుడు, వినాయకుడు, గజాననుడు, లంబోదరుడు వంటి అనేక పేర్లతో భక్తులు ఆరాధిస్తారు. ఏ శుభకార్యమైనా ప్రారంభించే ముందు గణపతిని పూజించడం భారతీయుల ఆచారంగా మారింది. ఎందుకంటే గణేశుడు విఘ్నాలను తొలగించి విజయాన్ని ప్రసాదించే దేవుడిగా విశ్వసిస్తారు. అందుకే వినాయక చవితి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భక్తి, విశ్వాసం, కుటుంబ అనుబంధాలు, సామాజిక ఐక్యతను ప్రతిబింబించే ఒక గొప్ప సంస్కృతిక ఉత్సవం. పురాణాల ప్రకారం పార్వతీ దేవి తన శరీరానికి పూసుకున్న పసుపుతో ఒక బాలుడిని సృష్టించి ద్వారపాలకుడిగా నియమించింది. ఆ తరువాత జరిగిన సంఘటనల్లో శివుడు ఆ బాలుడి తలను ఖండించగా, పార్వతీ దేవి దుఃఖాన్ని చూసి ఏనుగు తలను అమర్చి తిరిగి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి గజాననుడిగా గణపతి ప్రసిద్ధి చెందాడు. దేవతలందరూ ఆయనకు ప్రథమ పూజాధికారం కల్పించారని పురాణాలు చెబుతున్నాయి. అందుకే వివాహం నుంచి గృహప్రవేశం వరకు, విద్యాభ్యాసం నుంచి వ్యాపార ప్రారంభం వరకు ప్రతి శుభకార్యంలో ముందుగా గణపతిని పూజిస్తారు. గణేశుడి రూపంలో కూడా గొప్ప సందేశాలు దాగి ఉన్నాయి. పెద్ద తల విశాలమైన ఆలోచనలకు, పెద్ద చెవులు ఇతరుల మాటలను శ్రద్ధగా వినడానికి, చిన్న కళ్ళు ఏకాగ్రతకు, తొండం అనుకూలతకు ప్రతీకలుగా భావిస్తారు. వినాయక చవితి సందర్భంగా ఇళ్లలో, దేవాలయాల్లో, వీధుల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పత్రి, దుర్వా గడ్డి, మోదకాలు, ఉండ్రాళ్లు, లడ్డూలతో స్వామికి నైవేద్యాలు సమర్పిస్తారు. చిన్నారులు కొత్త బట్టలు ధరించి ఉత్సవాల్లో పాల్గొంటారు. కాలనీలు, గ్రామాలు, పట్టణాల్లో యువకులు కలిసి మండపాలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంగీతం, నృత్యాలు, భక్తి గీతాలు, సామాజిక సందేశాలతో కూడిన కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకుంటాయి. ఈ పండుగ ద్వారా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పొరుగువారు ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకుంటారు. సమాజంలో ఐక్యత, స్నేహభావం, సహకార భావనలు పెంపొందించడంలో గణేశ్ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయి.ఇటీవలి సంవత్సరాల్లో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలు, రసాయన రంగులతో అలంకరించిన గణపతులు నదులు, చెరువులు, సరస్సుల్లో నిమజ్జనం చేసిన తర్వాత నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి. జలచరాల జీవనానికి కూడా ఇవి ముప్పుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మట్టి వినాయకుల ప్రాధాన్యం మరింత పెరిగింది. మట్టితో తయారైన గణపతి విగ్రహాలు సహజసిద్ధంగా నీటిలో కరిగిపోతాయి. పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించవు. కొంతమంది మట్టి గణపతుల్లో విత్తనాలను కూడా అమర్చి తయారు చేస్తున్నారు. నిమజ్జనం అనంతరం ఆ మట్టి మొక్కలుగా మారి ప్రకృతికి మేలు చేస్తుంది. భక్తి భావనతో పాటు ప్రకృతి పరిరక్షణను కూడా కలిపే ఈ విధానం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోంది.మన పూర్వీకులు ప్రకృతిని దైవంగా భావించి పండుగలను రూపొందించారు. వినాయక చవితి కూడా అందుకు మినహాయింపు కాదు. పత్రి పూజ, మట్టి విగ్రహాలు, సహజ పదార్థాలతో నైవేద్యాలు తయారు చేయడం వంటి సంప్రదాయాల వెనుక ప్రకృతి పరిరక్షణ సందేశం దాగి ఉంది. ఆధునిక కాలంలో ఆ సంప్రదాయాలను మరచిపోతున్న పరిస్థితుల్లో మళ్లీ వాటి వైపు తిరిగి చూడాల్సిన అవసరం ఉంది. మట్టి వినాయకులను ఎంపిక చేసుకోవడం ద్వారా మనం భక్తిని మాత్రమే కాదు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని కూడా అందించగలుగుతాం. ఇది ప్రతి భక్తుడి సామాజిక బాధ్యతగా భావించాలి. వినాయక చవితి మనకు భక్తి, జ్ఞానం, క్రమశిక్షణ, ఐక్యత, ప్రకృతి ప్రేమ వంటి విలువలను నేర్పుతుంది. ఈ పండుగను వైభవంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా గణేశుడి ఆశీస్సులు పొందవచ్చు. భక్తి, సంస్కృతి, సామాజిక చైతన్యం, ప్రకృతి పరిరక్షణలను కలగలిపిన వినాయక చవితి భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పే మహోత్సవంగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.

22-A జాబితాలో భూములు..
సామాన్యుడి ఆస్తికి భద్రత ఎక్కడ?

భూమి అనేది మన దేశంలో కేవలం ఒక ఆస్తి కాదు. రైతుకు అది జీవనాధారం. మధ్యతరగతి కుటుంబానికి అది జీవితకాల పొదుపు. పిల్లల చదువు, పెళ్లి, వైద్యం, వ్యాపారం అవసరం వచ్చినప్పుడు ఆ భూమే కుటుంబానికి ఆర్థిక అండగా నిలుస్తుంది. అలాంటి భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఒక్కసారిగా '22A' జాబితాలో కనిపిస్తే ఆ కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుంది? చేతిలో పట్టా ఉంది. రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి. ఏళ్లుగా పన్నులు చెల్లిస్తున్నారు. అయినా ఆ భూమిని అమ్మడానికి వెళ్తే రిజిస్ట్రేషన్ ఆగిపోతుంది. కారణం 22A.

22A అంటే అసలు ఏమిటి?

22A అనేది భూమి యజమాని హక్కును రద్దు చేసే చట్టం కాదు. కొన్ని రకాల ఆస్తుల కొనుగోలు, అమ్మకం లేదా బదలాయింపును రిజిస్ట్రేషన్ చేయకుండా అడ్డుకునే చట్ట పరమైన నిబంధన. Registration Act, 1908లోని Section 22A కింద చట్టపరంగా బదలాయించడానికి వీలులేని లేదా ప్రత్యేక రక్షణ అవసరమైన కొన్ని ఆస్తులను 'Prohibited Properties' (నిషేధిత ఆస్తులు) జాబితాలో చేర్చవచ్చు. ఉదాహరణకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, కొన్ని దేవాదాయ/చారిటబుల్ సంస్థల భూములు, వక్ఫ్ ఆస్తులు, చట్టపరంగా బదలాయింపుపై ఆంక్షలు ఉన్న ఇతర ఆస్తులు ఈ జాబితాలోకి రావచ్చు. అంటే ఒక భూమి 22A జాబితాలో ఉందని తెలిసిందంటే, "ఈ భూమి ప్రభుత్వానిదే" అని అర్థం కాదు. ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ లేదా బదలాయింపుపై చట్టపరమైన ఆంక్ష ఉందని అర్థం. ఉదాహరణకు ఒక భూమిని అమ్మడానికి యజమాని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడనుకుందాం. ఆ భూమి సర్వే నంబర్ 22A నిషేధిత జాబితాలో ఉంటే, సాధారణంగా రిజిస్ట్రేషన్ అధికారి ఆ అమ్మకపు పత్రాన్ని రిజిస్టర్ చేయలేడు. దీంతో అమ్మకం ఆగిపోతుంది.

చట్టబద్ధమైన ఐదు రకాల వర్గీకరణ

ఈ చట్టం కింద భూములను ఐదు రకాలుగా వర్గీ కరించారు. మొదటిది సెక్షన్ 22A(1)(a) కింద అసైన్డ్, ప్రభుత్వ భూములు వస్తాయి. రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ భూములు, పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు లేదా మాజీ సైనికులకు కేటాయించిన భూములు దీని పరిధిలో ఉంటాయి. ఈ భూములపై యాజమాన్య హక్కులు ప్రభుత్వానికే ఉంటాయి. కాబట్టి వీటిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మడం లేదా రిజిస్ట్రేషన్ చేయడం చట్టవిరుద్ధం. రెండోది సెక్షన్ 22A(1)(b) కింద ప్రభుత్వ సంస్థల భూములు వస్తాయి. కేంద్ర ప్రభుత్వానికి లేదా రాష్ట్రప్రభుత్వరంగ సంస్థలకు, స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, పంచాయతీలకు చెందిన భూములు దీనికి చెందుతాయి. ఆయా సంస్థలకు సంబంధించిన అధీకృత అధికారి ప్రత్యేక అనుమతి ఇస్తే తప్ప ఈ భూముల రిజిస్ట్రేషన్ జరగదు. మూడోది సెక్షన్ 22A(1)(c) కింద దేవాదాయ, వక్ఫ్ భూములు వస్తాయి. హిందూ దేవాలయాలు, మఠాలకు చెందిన దేవాదాయ ఆస్తులు, మసీదులు, ఈద్గాలు, స్మశాన వాటికలకు చెందిన వక్ఫ్ బోర్డు భూములు, చర్చి ఆస్తులు. ప్రైవేట్ వ్యక్తులు ఈ దైవనిధులను కొనుగోలు చేయడానికి లేదా అమ్మడానికి వీల్లేదు. నాలుగోది సెక్షన్ 22A(1)(d) కింద మిగులు భూములు వస్తాయి. ల్యాండ్ సీలింగ్ చట్టం పరిమితి కంటే ఎక్కువ ఉన్నందున ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న మిగులు భూములు దీని కిందకు వస్తాయి. ఐదవది సెక్షన్ 22A(1)(e) కింద కోర్టు వివాదాలు, ప్రత్యేక నోటిఫికేషన్ భూములు వస్తాయి. ప్రభుత్వ ప్రజా ఉపయోగ స్థలాలు, చెరువులు, రోడ్లు, ఉద్యానవనాలు, కోర్టుల ద్వారా జప్తు అయిన లేదా స్టే ఆర్డర్ ఉన్న ఆస్తులు దీని పరిధిలో ఉంటాయి. మోసపూరిత విక్రయాలను అరికట్టడానికి, కోర్టు ఆదేశాలను గౌరవించడానికి ఈ భూముల రిజిస్ట్రేషన్ను తాత్కాలికంగా లేదా శాశ్వతంగా నిలిపివేస్తారు.

తెలంగాణలో 22A వివాదం

తెలంగాణలో ప్రస్తుతం 22A జాబితాపై వివాదం ఈ కారణంగానే ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని ప్రైవేట్ ఆస్తులు కూడా నిషేధిత జాబితాలో చేరినట్లు ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం వాటిని పరిశీలిస్తోంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా కొన్ని సందర్భాల్లో అధికారుల తప్పిదాల వల్ల నిజమైన ఆస్తులు నిషేధిత జాబితాలో చేరినట్లు అంగీకరించారు. ఇక్కడ ఒక ఉదాహరణ పరిస్థితి మరింత స్పష్టంగా చూపిస్తుంది. ఒకే సర్వే నంబర్‌లో కొన్ని భూములకు మాత్రమే సమస్య ఉన్నప్పటికీ మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చితే, ఆ సర్వే నంబర్‌లోని ఇతర నిజమైన భూమి యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంటే ఒకరి భూమిపై ఉన్న వివాదం మరొకరి ఆస్తి హక్కును కూడా ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. రెవెన్యూ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయం అంటూ ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. చివరకు కోర్టును ఆశ్రయించాల్సి వస్తే సంవత్సరాల సమయం, డబ్బు ఖర్చవుతుంది. ప్రభుత్వ రికార్డులో జరిగిన తప్పుకు పరిహారం పొందడానికి కూడా ప్రజలే ఎందుకు ఖర్చు చేయాలి?

22A అవసరమే.. కానీ పారదర్శకత కూడా అవసరం

ప్రభుత్వం భూములను రక్షించడానికి 22A వంటి నిబంధనలు తీసుకురావడం అవసరమే. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు లేదా చట్టపరంగా బదలాయించరాని ఆస్తులు అక్రమంగా అమ్ముడుపోకుండా నిరోధించడం ప్రభుత్వ బాధ్యత. కానీ అదే సమయంలో నిజమైన ప్రైవేట్ ఆస్తులను తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చకుండా చూడటం కూడా ప్రభుత్వ బాధ్యతే. అందుకే పరిష్కారం 22A నిబంధనను తొలగించడం కాదు. దాన్ని పారదర్శకంగా, ఖచ్చితంగా అమలు చేయడం. ఒక భూమిని 22Aలో చేర్చే ముందు దాని రికార్డులను సమగ్రంగా పరిశీలించాలి. సంబంధిత భూమి యజమానికి సమాచారం ఇవ్వాలి. అభ్యంతరం చెప్పేందుకు అవకాశం కల్పించాలి. తప్పుగా చేర్చిన భూమిని తొలగించేందుకు సులభమైన విధానం ఉండాలి. ముఖ్యంగా నిషేధిత ఆస్తుల పూర్తి జాబితాను ప్రజలకు ఆన్‌లైన్‌లో స్పష్టంగా అందుబాటులో ఉంచాలి. ఈ పారదర్శకత అవసరాన్ని తెలంగాణ హైకోర్టు విచారణలో కూడా ప్రస్తావించింది. నిషేధిత ఆస్తుల జాబితా ప్రజలకు అందుబాటులో ఉండటం, వ్యవసాయ భూముల వివరాలను కూడా పబ్లిక్ డొమైన్‌లో ఉంచడం వంటి అంశాలపై కోర్టు ప్రభుత్వ స్పందన కోరింది. భూమి కొనుగోలు చేసే సామాన్యుడికి ఇది చాలా ముఖ్యం. ఒక వ్యక్తి తన జీవితకాల పొదుపుతో భూమి కొనుగోలు చేస్తున్నప్పుడు, ఆ భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఏ స్థితిలో ఉందో ముందుగానే తెలుసుకునే హక్కు అతనికి ఉండాలి. సమాచారం దాచిపెట్టి తర్వాత సమస్య వచ్చినప్పుడు బాధ్యత మొత్తం కొనుగోలుదారుడిపైనే వేయడం న్యాయం కాదు. ఇక మరో ముఖ్యమైన విషయం డిజిటల్ రికార్డులు ఉన్నాయంటే సమస్య పరిష్కారమైనట్టే కాదు. తప్పు సమాచారం డిజిటల్‌గా నమోదైతే ఆ తప్పు మరింత వేగంగా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి భూ రికార్డుల డిజిటలైజేషన్‌తో పాటు వాటి ధృవీకరణ, పాత రికార్డులతో సరిపోల్చడం, సర్వే నంబర్లను ఖచ్చితంగా మ్యాప్ చేయడం కూడా అవసరం.

ఇది రాజకీయ పోరాటం కాదు.. ప్రజల ఆస్తి హక్కుల ప్రశ్న

22A వ్యవస్థను రాజకీయ పోరాటంగా మాత్రమే చూడటం కూడా సరైంది కాదు. ప్రభుత్వం ఒక వైపు తన చర్యలను సమర్థించుకోవచ్చు. ప్రతిపక్షాలు మరోవైపు ఆరోపణలు చేయవచ్చు. కానీ చివరకు ప్రజలకు కావాల్సింది రాజకీయ ప్రకటనలు కాదు తమ భూమి రికార్డులో నిజంగా ఏముందో స్పష్టంగా తెలిసే హక్కు. ఒక రైతుకు తన భూమి అమ్ముకునే హక్కు ఉందా లేదా అన్నది తెలుసుకోవడానికి ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. ఒక కుటుంబం తన ఆస్తిని పిల్లల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవాలంటే ప్రభుత్వ రికార్డులోని ఒక తప్పు అడ్డంకిగా మారకూడదు. భూమి విషయంలో ప్రతి సర్వే నంబర్ వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ప్రతి పట్టా వెనుక ఒక రైతు కష్టం ఉంటుంది. ప్రతి రిజిస్ట్రేషన్ పత్రం వెనుక ఒక కుటుంబం భవిష్యత్తు ఉంటుంది. అందుకే 22A నిబంధన ప్రజల ఆస్తులను కాపాడే రక్షణ గోడగా ఉండాలి ప్రభుత్వ రికార్డు తప్పిదాలతో ప్రజల ఆస్తి హక్కులను అడ్డుకునే గోడగా మారకూడదు.

ప్రభుత్వ భూమిని కాపాడటం ఎంత ముఖ్యమో, నిజమైన ప్రైవేట్ భూమిని ప్రభుత్వ తప్పిదాల నుంచి కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. 22Aలో ఒక సర్వే నంబర్ చేరడం ప్రభుత్వానికి ఒక రికార్డు మార్పు కావచ్చు. కానీ ఆ భూమి యజమానికి అది అతని జీవిత పొదుపు, అతని కుటుంబ భవిష్యత్తు. ఆ తేడాను ప్రభుత్వం గుర్తించినప్పుడే భూ పరిపాలనలో నిజమైన ప్రజాస్వామ్యం మొదలవుతుంది.



- బసడ సంపత్ యాదవ్
7032132593

ధరల మంటలు.. సామాన్యుడి బతుకుపై భారాలు

డెస్క్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): ఈ ఏడాది వర్షాకాలం రైతులకు ఆశించిన ఆనందాన్ని ఇవ్వలేకపోయింది. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలపై దేశ వ్యవసాయ రంగం ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. అయితే ఈసారి అనేక ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యంగా రావడం, కొన్నిప్రాంతాల్లో అసలు సరిపడా వర్షపాతం నమోదుకాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు మధ్యలో ఆగిపోవడంతో మొక్కలు పూర్తిగా ఎదగలేకపోతున్నాయి. అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులు ఇప్పుడు పెట్టుబడి కూడా తిరిగి వస్తుందా అనే ఆందోళనలో ఉన్నారు. వ్యవసాయం ప్రకృతిపై ఆధారపడిన రంగం కావడంతో వర్షాభావం నేరుగా రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తోంది.

వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం వల్ల దాని ప్రభావం వెంటనే మార్కెట్‌పై కనిపిస్తోంది. పొలాల్లో పంట దిగుబడులు తగ్గితే మార్కెట్‌కు వచ్చే సరుకుల పరిమాణం కూడా తగ్గిపోతుంది. సరఫరా తగ్గినప్పుడు డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరగడం సహజం. ప్రస్తుతం కూరగాయలు, పప్పుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలు వంటి అనేక నిత్యావసర వస్తువుల ధరలు గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా వర్షాలపై ఆధారపడే పంటల విషయంలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు సామాన్య ప్రజలు సులభంగా కొనుగోలు చేసిన వస్తువులు ఇప్పుడు ఖర్చును లెక్కించుకుని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయల మార్కెట్లలో ప్రస్తుతం కనిపిస్తున్న ధరలు సామాన్యుడిని కలవరపెడుతున్నాయి. టమాటా, ఉల్లి, మిర్చి, బెండకాయ, వంకాయ, బీరకాయ వంటి సాధారణ కూరగాయల ధరలు కూడా తరచూ పెరుగుతూ కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. రోజువారీ ఆహారంలో భాగమైన ఈ వస్తువులు ఖరీదైపోవడంతో ప్రజలు కొనుగోళ్లను తగ్గించుకోవాల్సి వస్తోంది. కొంతమంది కుటుంబాలు ఒకప్పుడు రోజూ వండే కూరలను ఇప్పుడు వారంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ధరల పెరుగుదల ప్రజల ఆహారపు అలవాట్లను కూడా ప్రభావితం చేస్తోంది. ధాన్యాలు, పప్పుధాన్యాలు, వంట నూనెల ధరలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. పప్పులు, నూనెలు, మసాలా దినుసులు వంటి వస్తువులు ప్రతి ఇంటికి అవసరం. వీటి ధరలు పెరగడం వల్ల వంటగది ఖర్చు గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు నెలకు కేటాయించిన బడ్జెట్ ఇప్పుడు సరిపోవడం లేదు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నాయి. ఆహార భద్రత విషయంలో కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు తోడు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇంధన ధరలు పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ప్రతి వస్తువు ధరలో అదనపు భారం చేరుతుంది. రైతు పొలం నుంచి మార్కెట్ వరకు, ఫ్యాక్టరీ నుంచి వినియోగదారుడి ఇంటి వరకు ప్రతి దశలో ఖర్చులు పెరుగుతాయి. అందువల్ల పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబంపై పడుతోంది. ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది. వంట గ్యాస్ ధరలు కూడా కుటుంబ బడ్జెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగినప్పుడల్లా ఇంటి ఖర్చుల లెక్కలు పూర్తిగా మారిపోతాయి. ఒకప్పుడు సంవత్సరానికి కొన్ని సార్లు మాత్రమే ధరల పెరుగుదల కనిపించేది. ఇప్పుడు తరచూ ధరల్లో మార్పులు చోటుచేసుకోవడంతో గృహిణులు నెలవారీ ఖర్చులను సర్దుబాటు చేయడం కష్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది మళ్లీ కట్టెల పొయ్యిల వైపు మొగ్గు చూపుతున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఇది ఆరోగ్యపరంగా, పర్యావరణపరంగా కూడా ఆందోళనకర అంశమే. ధరల పెరుగుదల ప్రభావం అత్యంత తీవ్రంగా కనిపిస్తున్న వర్గం మధ్యతరగతి. ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిధిలో పూర్తిగా రాని ఈ వర్గం, మార్కెట్ ధరల ప్రభావాన్ని నేరుగా భరిస్తోంది. ఉద్యోగుల జీతాలు అదే స్థాయిలో ఉండగా ఖర్చులు మాత్రం నెల నెలా పెరుగుతున్నాయి. పిల్లల చదువులు, వైద్యం, అద్దె, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులు అన్నీ పెరుగుతుండటంతో పొదుపు అనే భావన క్రమంగా తగ్గిపోతోంది. చాలా కుటుంబాలు అవసరాలు, కోరికల మధ్య తేడా చూసుకుంటూ ఖర్చులను నియంత్రించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. వీరి ఆదాయం స్థిరంగా ఉండదు. పని దొరికితేనే సంపాదన ఉంటుంది. అలాంటి పరిస్థితిలో ధరల పెరుగుదల నేరుగా వారి జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతోంది. కుటుంబ సభ్యులకు పోషకాహారం అందించడం, పిల్లల చదువులు కొనసాగించడం, వైద్య ఖర్చులు భరించడం వంటి అంశాలు భారంగా మారుతున్నాయి. ద్రవ్యోల్బణం ప్రభావం సమాజంలోని బలహీన వర్గాలపై ఎంత తీవ్రంగా ఉంటుందో ఈ పరిస్థితులు స్పష్టంగా చూపిస్తున్నాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకునే చర్యలు అత్యంత కీలకం. రైతులకు సాగునీటి వసతులు కల్పించడం, నీటి సంరక్షణపై దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయడం, పంట బీమా పథకాలను సమర్థంగా అమలు చేయడం అవసరం. అలాగే నిత్యావసర వస్తువుల నిల్వలను పెంచడం, ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం, అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవడం అవసరం. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర లభించే విధంగా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

ధరల పెరుగుదల అనేది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, సామాజిక సమస్య కూడా. రైతు పొలంలో పంట సరిగా పండకపోతే దాని ప్రభావం పట్టణాల్లోని కుటుంబాల పంటగదుల వరకు చేరుతుంది. వర్షాభావం, తగ్గిన దిగుబడులు, పెరుగుతున్న రవాణా ఖర్చులు, అధిక ఇంధన ధరలు అన్నీ కలిసి సామాన్యుడి జీవనాన్ని భారంగా మారుస్తున్నాయి. ఈ పరిస్థితిని తాత్కాలిక సమస్యగా కాకుండా భవిష్యత్‌కు హెచ్చరికగా చూడాలి. వ్యవసాయాన్ని బలోపేతం చేయడం, నీటి వనరులను సంరక్షించడం, ధరల నియంత్రణకు సమర్థవంతమైన విధానాలు అమలు చేయడం ద్వారా మాత్రమే రైతు నుంచి వినియోగదారుడి వరకు అందరికీ ఉపశమనం కల్పించవచ్చు. రైతు బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది, సామాన్యుడి బతుకు సైతం సాఫీగా సాగుతుంది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

హిందీ దివస్: భాష వారసత్వానికి గౌరవ వందనం

డెస్క్, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక భాషలు, మాండలికాలు మాట్లాడే దేశాలలో ఒకటి. ఇక్కడ ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన భాషా సంపద ఉంది. ఈ వైవిధ్యభరితమైన భాషా సంస్కృతుల మధ్య పరస్పర అనుసంధానానికి హిందీ ఒక ప్రధాన భాషగా ఎదిగింది. దేశంలోని ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో విస్తృతంగా ఉపయోగించబడే హిందీ నేడు భారతదేశంలో అత్యధిక మంది మాట్లాడే భాషగా గుర్తింపు పొందింది. ఈ భాష ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ దివస్‌ను నిర్వహిస్తారు. భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాకుండా ఒక జాతి చరిత్రను, సంస్కృతిని, భావజాలాన్ని ప్రతిబింబించే అద్దం. అలాంటి భాషలకు గౌరవం ఇవ్వడం దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడమే అవుతుంది.

1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ పరిపాలనకు సంబంధించిన అనేక అంశాలపై రాజ్యాంగ సభలో విస్తృత చర్చలు జరిగాయి. అందులో అధికార భాష అంశం అత్యంత ప్రాధాన్యం పొందింది. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య పరిపాలనా సంబంధాలు సులభతరం కావాలంటే ఒక అధికార భాష అవసరమని భావించారు. ఈ నేపథ్యంలో 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ సభ హిందీని దేవనాగరి లిపిలో కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా ఆమోదించింది. ఈ చారిత్రక నిర్ణయం భారత భాషా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. అదే రోజును గుర్తుగా చేసుకుని ప్రతి ఏడాది హిందీ దివస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సమయంలో దేశ భాషా వైవిధ్యాన్ని కూడా సమానంగా గౌరవించాలనే దృక్పథాన్ని రాజ్యాంగ నిర్మాతలు ప్రదర్శించారు.

హిందీ భాష అభివృద్ధి వెనుక అనేక శతాబ్దాల చరిత్ర ఉంది. సంస్కృత భాష నుంచి పుట్టుకొచ్చిన ప్రాకృత, అపభ్రంశ భాషల పరిణామ క్రమంలో హిందీ రూపుదిద్దుకుంది. భక్తి ఉద్యమ కాలంలో కబీర్, తులసీదాస్, సూరదాస్ వంటి మహాకవులు హిందీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అనంతరం భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కూడా హిందీ కీలక పాత్ర పోషించింది. మహాత్మా గాంధీతో సహా అనేక మంది జాతీయ నాయకులు దేశ ప్రజలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో హిందీ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని విశ్వసించారు. దీంతో హిందీ భాష దేశవ్యాప్తంగా మరింత విస్తరించింది.

హిందీ దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాహిత్య సభలు, కవిసమ్మేళనాలు నిర్వహిస్తారు. విద్యార్థుల్లో భాష పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. ప్రభుత్వ విభాగాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమాల ఉద్దేశం హిందీని ఇతర భాషలపై రుద్దడం కాదు; అధికార భాషగా దాని పాత్రను గుర్తుచేసుకుంటూ భాషా అవగాహన పెంపొందించడం. భారత రాజ్యాంగం అన్ని భాషలకు సమాన గౌరవం కల్పించింది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో ప్రస్తుతం 22 భాషలకు గుర్తింపు ఉంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ వంటి భాషలన్నీ భారత సాంస్కృతిక సంపదలో భాగమే. హిందీ దివస్ సందర్భంలో గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఒక భాష ఎదగడం అంటే మరో భాష వెనుకబడిపోవడం కాదు. అన్ని భారతీయ భాషలు పరస్పరం పరిపూరకంగా అభివృద్ధి చెందితేనే దేశ భాషా సంపద మరింత బలోపేతం అవుతుంది.నేటి డిజిటల్ యుగంలో హిందీ భాష వినియోగం గణనీయంగా పెరిగింది. సోషల్ మీడియా, యూట్యూబ్, వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లు, డిజిటల్ వార్తా మాధ్యమాల ద్వారా హిందీ కంటెంట్ విస్తృతంగా అందుబాటులోకి వస్తోంది. కృత్రిమ మేధస్సు, యంత్ర అనువాదం, డిజిటల్ విద్యా వేదికల అభివృద్ధితో హిందీ వినియోగానికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా డిజిటల్ ప్రపంచంలో తమ భాషలోనే సమాచారాన్ని పొందగలుగుతున్నారు. ఈ పరిణామాలు భాషల అభివృద్ధికి సాంకేతికత ఎంతగానో దోహదపడుతుందని నిరూపిస్తున్నాయి. భారతీయ సినీ పరిశ్రమలో హిందీకి ప్రత్యేక స్థానం ఉంది. బాలీవుడ్ సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. హిందీ పాటలు, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఆదరణ పొందుతున్నాయి. దీంతో హిందీ భాష అంతర్జాతీయ గుర్తింపును సంపాదించింది. అనేక దేశాల్లోని విశ్వవిద్యాలయాలు హిందీ భాషను బోధిస్తున్నాయి. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు తమ పిల్లలకు హిందీ నేర్పించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి హిందీ ప్రపంచ భాషగా ఎదుగుతున్న సంకేతంగా భావించవచ్చు.అయితే భాషల అభివృద్ధి విషయంలో సమతుల్యత ఎంతో అవసరం. ప్రపంచీకరణ ప్రభావంతో ఆంగ్ల భాష ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ మాతృభాషలను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదు. ఒక వ్యక్తి తన మాతృభాషలో బలమైన పునాది ఏర్పరచుకున్నప్పుడే ఇతర భాషలను సులభంగా నేర్చుకోగలడు. అందువల్ల హిందీతో పాటు ప్రతి భారతీయుడు తన ప్రాంతీయ భాషను కూడా సమానంగా ప్రేమించి, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉంది. భాషలను పరస్పర పోటీదారులుగా కాకుండా జ్ఞానాన్ని పంచుకునే వేదికలుగా చూడాలి.

హిందీ దివస్ మనకు ఇచ్చే ప్రధాన సందేశం భాషను ప్రేమించడం, భాషా వైవిధ్యాన్ని గౌరవించడం. భారతదేశ బలం దాని భిన్నత్వంలోనే ఉంది. ఒకే దేశంలో వందలాది భాషలు జీవించి ఉండటం ప్రపంచంలో అరుదైన విషయం. ఈ భాషలన్నింటినీ కాపాడుకోవడం, అభివృద్ధి చేయడం మనందరి బాధ్యత. హిందీ దివస్ ఒక భాషకు సంబంధించిన వేడుక మాత్రమే కాదు; భారత భాషా సంపదకు నివాళి అర్పించే సందర్భం. భాషల మధ్య స్నేహం, పరస్పర గౌరవం, సాంస్కృతిక అనుసంధానం పెరిగినప్పుడే భారతదేశం తన అసలైన వైభవాన్ని ప్రపంచానికి చాటగలదు.

స్టాక్ మార్కెట్లకు సెలవు

ముంబై, సెప్టెంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): దేశీయ స్టాక్ మార్కెట్లకు రేపు (సెప్టెంబరు 14) సెలవు ఉండనుంది. వినాయక చవితి సందర్భంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో ట్రేడింగ్ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి.

వినాయక చవితి సోమవారం రావడంతో వారాంతపు సెలవులు కూడా కలిశాయి. శనివారం, ఆదివారం సాధారణ సెలవులు కాగా.. సోమవారం పండుగ సెలవు కావడంతో స్టాక్ మార్కెట్లు వరుసగా మూడు రోజుల పాటు మూతపడుతున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు మూడు రోజుల పాటు మార్కెట్ కార్యకలాపాలకు దూరంగా ఉండనున్నారు.

సెప్టెంబరు 15 నుంచి ట్రేడింగ్

వినాయక చవితి సెలవు అనంతరం సెప్టెంబరు 15, మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఆ రోజు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో సాధారణంగా ట్రేడింగ్ కొనసాగుతుంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త సీఈఓ ఎవరు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రస్తుత ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో కొత్త వ్యక్తిని నియమించేందుకు ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రాధాన్యత క్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సిఫారసు చేసినట్లు బ్యాంక్ వెల్లడించింది.

కొత్త ఎండీ, సీఈఓ నియామకం మూడేళ్ల కాలానికి ప్రతిపాదించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. అయితే ఈ నియామకం పూర్తిగా ఆర్‌బీఐ తుది ఆమోదానికి లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఆర్‌బీఐకి పంపిన ఇద్దరు అభ్యర్థుల పేర్లను మాత్రం బ్యాంక్ అధికారికంగా వెల్లడించలేదు.

పలువురి పేర్లు పరిశీలనలో

మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాజీ డిప్యూటీ ఎండీ పరేశ్ సుతాంకర్, భారత్‌లో సిటీ బ్యాంక్ చీఫ్ కంట్రీ ఆఫీసర్ కే. బాలసుబ్రమణియన్, ఆదిత్య బిర్లా గ్రూప్ సీఈఓ విశాఖ మూల్యే పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కీలక పదవుల్లో ఉన్నవారిపై దృష్టి

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ జిమ్మీ టాటా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఎండీ, సీఈఓ విభా పదాల్కర్ పేర్లు కూడా కొత్త సీఈఓ ఎంపికలో వినిపిస్తున్నాయి. అయితే వీరిలో ఎవరిని ఆర్‌బీఐకి సిఫారసు చేశారన్న దానిపై స్పష్టత లేదు. ఆర్‌బీఐ ఆమోదం తర్వాతే కొత్త ఎండీ, సీఈఓ నియామకంపై తుది నిర్ణయం వెలువడనుంది.



స్మృతి మంధాన భావోద్వేగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులపై స్పందించింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. వ్యాఖ్యాత రాజ్ షమాని అడిగిన ఓ ప్రశ్నకు భావోద్వేగానికి గురైంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

'అత్యంత కఠినమైన రాత్రి ఏది?'

పాడ్‌కాస్ట్‌లో రాజ్ షమాని.. 'మీ జీవితంలో అత్యంత కఠినమైన రాత్రి ఏది?' అని స్మృతి మంధానను ప్రశ్నించాడు. ఈ ప్రశ్న విన్న వెంటనే ఆమె కొద్దిసేపు మౌనంగా ఉండిపోయింది. భావోద్వేగాలను నియంత్రించుకునేందుకు ప్రయత్నించిన అనంతరం.. 'బహుశా ఏదైనా ప్రపంచకప్ కావచ్చు' అని క్లుప్తంగా సమాధానమిచ్చింది. అయితే ఏ ప్రపంచకప్ లేదా ఏ మ్యాచ్ గురించి మాట్లాడుతున్నదో ఆమె స్పష్టంగా వెల్లడించలేదు.

తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను ప్రస్తావించేందుకు స్మృతి ఆసక్తి చూపలేదు. 'నేను క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతాను' అని స్పష్టం చేసింది. గతంలో సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్‌తో ఆమె వివాహం రద్దైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొంతకాలం స్మృతి వ్యక్తిగతంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వార్తలు వచ్చాయి.

తన కోపం గురించి కూడా స్మృతి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. బయటకు చూస్తే తనకు కోపం ఎక్కువగా ఉన్న వ్యక్తిలా కనిపించనప్పటికీ.. తనలో మాత్రం చాలా కోపం ఉంటుందని తెలిపింది. ఎవరి జోలికీ తాను వెళ్లనని, అలాగే తన దారిలోకి ఎవరూ రావద్దని చెప్పింది. తాను ప్రతీకారం తీర్చుకునే వ్యక్తిని కాదని.. అయితే తనకు జరిగిన విషయాలను మాత్రం సులభంగా మర్చిపోనని పేర్కొంది. ఎవరైనా తనను బాధపెడితే వారిని క్షమిస్తారా? అన్నప్రశ్నకు స్పందిస్తూ.. 'క్షమిస్తాను.. కానీ ఆ ఘటనను మర్చిపోను' అని స్మృతి మంధాన స్పష్టం చేసింది.

పీజీ అద్దెపై జీఎస్‌టీ ఉంటుందా?



హైదరాబాద్, సెప్టెంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): చదువు, ఉద్యోగాల కోసం సొంత ఊళ్లను వదిలి నగరాలకు వచ్చే విద్యార్థులు, యువతలో చాలామంది హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతుల్లో ఉంటున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పీజీ వసతులు పెద్ద వ్యాపారంగా మారాయి. గదితో పాటు భోజనం, వైఫై, లాండ్రీ, గృహ నిర్వహణ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండటంతో వీటికి డిమాండ్ పెరుగుతోంది.

నెలకు రూ.20 వేల వరకు మినహాయింపు

పీజీ, హాస్టల్ వసతులపై సాధారణంగా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వర్తిస్తుంది. అయితే కొన్ని నిబంధనలు పాటిస్తే పన్ను మినహాయింపు పొందే అవకాశం ఉంది. ఒక వ్యక్తి నుంచి నెలకు వసూలు చేసే మొత్తం రూ.20,000 మించకూడదు. అలాగే వసతి సేవలను వరుసగా కనీసం 90 రోజుల పాటు అందించాలి. ఈ రెండు షరతులు నెరవేరినప్పుడే మినహాయింపు వర్తిస్తుంది.

ఇతర సేవలతో కలిపితే కీలకం

గది అద్దె రూ.20,000 లోపే ఉన్నప్పటికీ.. భోజనం, ఇంటర్నెట్, లాండ్రీ వంటి ఇతర సదుపాయాలను కలిపిన తర్వాత మొత్తం చార్జీ రూ.20,000 దాటితే పన్ను వర్తింపుపై వేరుగా పరిశీలించాల్సి ఉంటుంది. అందించే అన్ని సేవలను కలిపి ఒకే సరఫరాగా పరిగణిస్తారా లేదా అనేది ముఖ్యంగా మారుతుంది.

'కాంపోజిట్ సప్లయ్' ఆధారంగా నిర్ణయం

ప్రధాన సేవకు అనుసంధానంగా సహజంగా అందించే ఇతర సేవలను కలిపి అందించడాన్ని కాంపోజిట్ సప్లయ్‌గా పరిగణిస్తారు. అందువల్ల పీజీ నిర్వాహకులు గది అద్దెతో పాటు భోజనం, వైఫై, లాండ్రీ తదితర సేవలకు వసూలు చేస్తున్న మొత్తాన్ని బట్టి జీఎస్‌టీ వర్తింపును నిర్ణయించాల్సి ఉంటుంది.

సబలెంకాకు షాక్.. రిబకినా ఛాంపియన్

న్యూయార్క్, సెప్టెంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా మూడోసారి గెలుచుకుని హ్యాట్రిక్ సాధించాలనుకున్న టెన్నిస్ స్టార్ అరీనా సబలెంకా ఆశలకు ప్రపంచ నంబర్‌వన్ ఎలీనా రిబకినా చెక్ పెట్టింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రిబకినా 64, 57, 62 తేడాతో సబలెంకాపై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది.

రాకెట్ బద్దలు కొట్టిన సబలెంకా

ఫైనల్ ఓటమిని సబలెంకా తీవ్రంగా తీసుకుంది. మ్యాచ్ పాయింట్ కోల్పోయిన వెంటనే అసహనానికి గురైన ఆమె తన రాకెట్‌ను నేలకేసి కొట్టి బద్దలు కొట్టింది. అనంతరం తన భావోద్వేగాలను చిత్రీకరించేందుకు ప్రయత్నించిన కెమెరా సిబ్బందిపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

నంబర్‌వన్ ర్యాంక్ కోల్పోయిన సబలెంకా

ఈ ఓటమితో 99 వారాలుగా కొనసాగుతున్న సబలెంకా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు తెరపడింది. ఆమెను వెనక్కి నెట్టి రిబకినా అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అయితే ఓటమి అనంతరం సబలెంకా నిరాశలో కూరుకుపోకుండా వచ్చే సీజన్‌లో మరింత బలంగా తిరిగి వస్తానని తెలిపింది. ఈ టోర్నీలో తాను ఆడిన స్థాయిపై సంతృప్తిగా ఉన్నానని, ఈ అనుభవాల నుంచి ఎంతో నేర్చుకున్నానని పేర్కొంది.

31 ఏళ్ల తర్వాత అరుదైన ఘనత

కజకిస్థాన్‌కు చెందిన రిబకినాకు ఇది కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఒకే ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్‌ను ఓడించిన రెండో క్రీడాకారిణిగా ఆమె రికార్డు సృష్టించింది. ఇంతకుముందు 1995లో టెన్నిస్ దిగ్గజం స్టెఫీ గ్రాఫ్ ఈ ఘనత సాధించింది. దాదాపు 31 ఏళ్ల తర్వాత రిబకినా ఈ అరుదైన రికార్డును సమం చేసింది.

ప్రపంచ వ్యాక్సిన్ కేంద్రంగా భారత్: జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, (తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచంలో అత్యధిక పరిమాణంలో వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్న దేశంగా భారత్ నిలిచిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన "కోలిషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్ ఇన్నోవేషన్స్" (సీఈపీఐ) బోర్డు, ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సభ్యుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రపంచ ఆరోగ్య భద్రతలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భారత్ ఇప్పటికే ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తి రంగంలో అగ్రస్థానంలో ఉందని వివరించారు. భారత్‌లో కనిపించే విభిన్న రకాల వ్యాధుల పరిస్థితులు వ్యాక్సిన్ పరిశోధనకు ప్రత్యేక అవకాశాలను కల్పిస్తున్నాయని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే ఇక్కడి వైవిధ్యమైన ఆరోగ్య పరిస్థితులు శాస్త్రవేత్తలకు విస్తృత పరిశోధన అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేకత భవిష్యత్ అంటువ్యాధులను ముందుగానే అంచనా వేసి నివారించడంలో దేశానికి బలంగా మారుతుందని చెప్పారు. కొవిడ్ మహమ్మారి అనంతరం భారత్ ఆరోగ్య రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. ఒక దశాబ్దం క్రితం ఉన్న పరిమితులను అధిగమించి, ఇప్పుడు ప్రపంచ స్థాయి మహమ్మారి సన్నద్ధతలో భాగస్వామిగా నిలిచే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధి, బయోటెక్నాలజీ పరిశోధనలు, బయోమాన్యుఫాక్చరింగ్ రంగాల్లో దేశం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్‌ను ప్రపంచ బయోమాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని జితేంద్ర సింగ్ వివరించారు. బయోఫార్మా, వ్యాక్సిన్ తయారీ, నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. పరిశోధన, పెట్టుబడులు, ఆవిష్కరణల సమన్వయంతో భారత బయోటెక్ రంగం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in